

# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

రిపోర్టర్లు కావలెను
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
మన దునియా
ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335

సంపుటి : 3 | సంచిక : 355 | ఆగస్టు 26 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-

# మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ వేగవంతం చేయండి



➤ ల్యాండ్ పూలింగ్ పై స్పష్టమైన విధానం రూపొందించండి

➤ సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్ పై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆయన వారికి సూచించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మూసీ ప్రాజెక్టు, ఆ నది ప్రక్షాళనపై సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ తదితర అంశాలపై స్పష్టమైన విధానాన్ని రూపొందించి సమర్పించాలంటూ ఆదేశించారు. ఇదే సమయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అతి తక్కువ వడ్డీకి రుణాలిచ్చే సంస్థలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టీడీఆర్ పై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలన్నారు. మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయ టెండర్లను తక్షణమే పిలవాలంటూ సూచించారు. కొత్వాల్ గూడలోని బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పుల్లెల గోపీచంద్

ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, క్రీడాకారులు గాయత్రి గోపీచంద్, త్రిషా జాలీ....సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా

(మిగతా 2వ పేజీలో..)

## శ్రావణమాసంలో కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధం..!!

### సురేఖ తో పాటు మరో ఇద్దరికి ఉద్వాసన..???

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 25**

కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో శ్రావణ మాసంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతున్నది.

ఒకరిద్దరు మంత్రులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతున్నది. కేబినెట్ నుంచి తప్పించే జాబితాలో కొండా సురేఖ పేరు తప్పనిసరిగా ఉంటుందని తెలుస్తున్నది. అదేసమయంలో మంత్రుల శాఖలను సైతం మార్చేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో డిస్కషన్ ఉంది.

సెప్టెంబరు 10 వరకు తేల్చేద్దాం..!!

సెప్టెంబరు 10 వరకు శ్రావణమాసం ఉంది. ఈలోపే కేబినెట్

(మిగతా 2వ పేజీలో..)



## గచ్చిబౌలిలో ఆగని కూల్చివేతలు.. భారీగా నిర్మాణాల కూల్చివేత

### అంజయ్య నగర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

### అక్రమ నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా సంయుక్త చర్యలు

### ఇప్పటికే రెండు భవనాలు నేలమట్టం

### మరో ఆరంతస్తుల భవనం కూల్చివేత పనులు ప్రారంభం

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రక్రియ మంగళవారం కూడా కొనసాగింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా

(మిగతా 2వ పేజీలో..)

## అప్పటివరకూ రాజకీయ సన్యాసం తీసుకోను :

**మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**

**మన దునియా,పశ్చిమ బెంగాల్:ఆగస్టు 25**

తాను రాజకీయ సన్యాసం తీసుకునే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీని కనుమరుగు చేసేంతవరకు తాను విశ్రమించబోనని ఆమె చెప్పారు. ప్రభుత్వం మారిన నాలుగు నెలల్లోనే రాష్ట్ర ప్రజలు బీజేపీ అసలు స్వరూపాన్ని

(మిగతా 2వ పేజీలో..)



## ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు కేటీఆర్ వార్నింగ్..?

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 25**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అవుతోంది. దీంతో... ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం పేరిట సమరభేరి మోగించబోతోంది బీఆర్ఎస్. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ పోరు బాట పట్టబోతోంది. అయితే... ఏదో, తూతూ మంత్రంగా ఒకరోజు నిరసన కార్యక్రమం నిర్వహించి వదిలేయకుండా... వారం రోజులపాటు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించింది గులాబీ అధిష్టానం. సమరభేరి పేరిట పార్టీ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం, వారంపాటు షెడ్యూల్ వేయడం వెనక గట్టి కారణమే ఉండవచ్చని అంటున్నాయి రాజకీయవర్గాలు. ఇప్పటి వరకు పార్టీ తీసుకున్న కార్యక్రమాలు రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ... జిల్లా, నియోజకవర్గాల లెవల్‌లో మాత్రం మమ అనిపిస్తున్నట్టు అధిష్టానం దగ్గర ఫీడ్‌బ్యాడ్

(మిగతా 2వ పేజీలో..)



# అప్పటివరకూ రాజకీయ సన్యాసం తీసుకోను :

(మొదటి పేజీ తరువాయి)



అర్థం చేసుకున్నారని మమతా ఫేస్‌బుక్ లైవ్‌లో అన్నారు. ఈ సందర్భంగా ఆమె జనాభా లెక్కల ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తారు. జాతీయ పౌర పట్టికని అమలుకు ఇది మరో రహస్య ప్రయత్నమని ఆరోపించారు. రాజకీయ పార్టీలను సంప్రదించకుండా అమలు చేశారన్నారు. జనాభా లెక్కల ఫారాలపై సంతకాలు చేసే ముందు, వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసే ముందు ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు. అలా చేయడం వల్ల వారి వ్యక్తిగత ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. మహిళల కోసం అందించే 'అన్నపూర్ణ భండార్' ఆర్థిక సహాయ పథకం కింద నిధులు అందడంలో జాప్యం జరుగుతోందంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళలు నిరసనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. అనర్హతను కారణంగా చూపి బీజేపీ ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తోందని ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్లను తొలగించారని మండిపడ్డారు. తొలగించిన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని మమతా స్పష్టం చేశారు. మహిళలను ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు 'లక్ష్మీ భండార్' పథకాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కానీ, బీజేపీ 'అన్నపూర్ణ భండార్'కు డబ్బు ఇచ్చేందుకు మతం, కులాన్ని ప్రాతిపదికగా వాడుకుంటోందని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు మహిళలందరికీ 'అన్నపూర్ణ యోజన' డబ్బు ఇస్తామన్న వాగ్దానాన్ని ఉల్లంఘించి ఇప్పుడు వారిని మోసం చేస్తోందని మమతా విమర్శలు గుప్పించారు. జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థుల మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో క్యాంపస్‌లో విధ్వంసానికి బీజేపీనే కారణమని ఆరోపించారు.

# మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ వేగవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

కలిశారు. ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్ షిప్స్ మహిళల డబుల్స్ లో గాయత్రి గోపీచంద్, త్రిషా జాలీ కాంస్య పతకం సాధించారు. ఈ నేపథ్యంలో వారిద్దరని సీఎం అభినందించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివీవీ లక్ష్మి కూడా పాల్గొన్నారు.

ప్రవక్త బోధించిన జీవన విధానం ఆదర్శప్రాయం

మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, క్రమబద్ధమైన జీవన విధానం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

# గచ్చిబౌలిలో ఆగని కూల్చివేతలు.. భారీగా నిర్మాణాల కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

ఈ కూల్చివేతలను చేపట్టారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం రెండు భవనాలను పూర్తిగా నేలమట్టం చేశారు. వీటితో పాటు మరో ఆరంతస్తుల భవనం కూల్చివేత పనులు సైతం కొనసాగుతున్నాయి. భారీ యంత్రాల సాయంతో అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తుండగా, ఆ ప్రాంతంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. గత శనివారం అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విదితమే. ఈ విషాదకర ఘటన నేపథ్యంలో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ప్రమాదకరంగా ఉన్న ఇతర అక్రమ కట్టడాలను, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నివారించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

# ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు కేటీఆర్ వార్నింగ్..?

(మొదటి పేజీ తరువాయి)

ఉందట. అందుకే...ఈసారి వారంపాటు చేయబోయే సమరభేరిని చేశామంటే చేశాం అన్నట్టు కాకుండా...సీరియస్‌గా జరపాలని ప్లాన్ చేసినట్టు సమాచారం. దీంతో... కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతం కావాలంటే... దాంట్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కచ్చితంగా పాల్గొనాలని కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్‌లో ఆదేశించారట. అదే సమయంలో పార్టీ నేతలకు ఆయన సీరియస్ వార్నింగ్ కూడా ఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటివరకు రాష్ట్ర పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను గ్రౌండ్ లెవెల్ వరకు తీసుకెళ్లకపోయినా పెద్దగా పట్టించుకోలేదని, ఇక మీదట అలా ఉండబోదని కేటీఆర్ చెప్పినట్టు తెలుస్తోంది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై వారం రోజులపాటు సమరభేరి చేయాలని ఆషామాషీగా నిర్ణయం తీసుకోలేదని, ఇది భవిష్యత్ సంకేతమని అన్నట్టు చెప్పుకుంటున్నారు. వారం రోజుల కార్యక్రమాన్ని జిల్లా, మండల, గ్రామస్థాయిలో కూడా సక్సెస్ చేయాలని కేటీఆర్ గట్టిగా అన్నట్టు తెలిసింది. గతంలోని కార్యక్రమాల మాదిరిగానే దీన్ని కూడా లైట్ తీసుకుంటే వాళ్లను పార్టీ కూడా లైట్ తీసుకుంటుందని స్ట్రాంగ్‌గా హెచ్చరించినట్టు సమాచారం. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్చార్జులు పార్టీ కార్యక్రమాలను చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారని, ఆ వైఖరి పార్టీకి నష్టం చేస్తోందని అన్నారట కేటీఆర్. ఎన్నికలకు మరో రెండేళ్ళ సమయం ఉండటంతో.. ఇప్పట్నుంచే ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని ముఖ్య నేతలకు చెప్పారట కేటీఆర్. సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయకుంటే అలాంటి వాళ్ళ విషయంలో కఠినమైన నిర్ణయాలు ఉంటాయని కూడా కేటీఆర్ కుండబద్దలు కొట్టారని చెబుతున్నారు. సమరభేరి కార్యక్రమం విజయవంతంకాని నియోజకవర్గాలను గుర్తించి... అక్కడి ఇన్చార్జ్‌లను మార్చే ప్రతిపాదన కూడా ఉందట. ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందేమోనని, ఏ నియోజకవర్గం ఎవరికి వస్తుందో తెలియదు కాబట్టి ఇప్పట్నుంచే ఖర్చు చేయడం ఎందుకని కొందరు దూరంగా ఉంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అన్నారట కేటీఆర్. ఏ కార్యక్రమమైనా రాష్ట్ర పార్టీ నుంచి ఖర్చు చేయాలంటే కష్టమని, లోకల్ గా ఉన్నవాళ్లు, గతంలో పదవులు అనుభవించిన వాళ్ళే అన్నీ చూసుకోవాలని పరోక్షంగా చెప్పినట్టు అంచనా వేస్తున్నారు. ఇన్నాళ్ళు ఎలా ఉన్నా... ఇక ఎన్నికల టైం సమీపించేకొద్దీ వత్తిడి పెరుగుతుంది కాబట్టి... ఎట్టి పరిస్థితుల్లో ఛాన్స్ తీసుకోకూడదని గులాబీ అధిష్టానం భావిస్తున్నట్టు కనిపిస్తోందంటున్నారు.

# శ్రావణమాసంలో కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధం..!!

(మొదటి పేజీ తరువాయి)

పునర్‌వ్యవస్థీకరణ చేపట్టాలని ఏఐసీసీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే వర్షకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబరు7 నుంచి ప్రారంభించి, రెండు మూడు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీనితో పునర్వ్యవస్థీకరణ సమావేశాలలోపు చేయాలా ? లేకపోతే ఆ తరువాత చేపట్టాలా ? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అయితే ఉన్నపళంగా కొండా సురేఖను మాత్రమే కేబినెట్ నుంచి తప్పిస్తే, మహిళా, బీసీ సామాజిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉంటుంది. ఆమె కుమార్తె సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేసినందుకు ప్రతికారంగానే మంత్రి వర్గం నుంచి తొలగించారని విమర్శలు వచ్చే చాన్స్ ఉంది. అందుకని పనితీరు సరిగాలేని మంత్రులను తప్పిస్తే రాజకీయంగా విమర్శలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందనే కోణంలో ఏఐసీసీ నేతలు ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. పనిలో పనిగా మంత్రుల వద్ద ఉన్న శాఖలను సైతం మార్చాలని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. కొందరు మంత్రులు తమ శాఖలను అడ్డంపెట్టుకుని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీనితో అటు మంత్రివర్గ రిషఫ్లింగ్, ఇటు మంత్రుల శాఖల్లో మార్పులు చేపడితే పాలన వ్యవహారంలో భాగంగా మార్పులు, చేర్పులు చేశారని సంకేతాలు వెళ్తాయని అధిష్టానం ఆలోచన చేస్తున్నట్టుగా తెలిసింది.

**ఒ(త)ప్పించే బాధ్యత ఏఐసీసీ పైనే..!!**

కేబినెట్ నుంచి తప్పించే మంత్రుల జాబితాను ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం ముందు పెట్టినట్టు తెలిసింది. సదరు మంత్రులను తప్పించేందుకు ఉన్న కారణాలను సైతం వివరించినట్టు సమాచారం. ఆ మంత్రులతో రాజీనామా చేయించే బాధ్యతలను మాత్రం ఏఐసీసీ పెద్దలు తీసుకునే చాన్స్ ఉందని తెలిసింది. రాజీనామాకు ఒప్పుకోకపోతే నయానో, భయానో దారిలోకి తెచ్చుకునే అవకాశం ఉంది. అయినా ఒప్పుకోకపోతే మాత్రం అప్పుడు బర్తరఫ్ అస్త్రాన్ని ప్రయోగించే అవకాశం ఉంటుందని ఏఐసీసీకి సన్నిహితంగా ఉండే ఓ నేత అభిప్రాయపడ్డారు. అయితే పదవి కోల్పోయిన తరువాత సదరు లీడర్లు మౌనంగా ఉంటారా ? ప్రభుత్వంపై ప్రతిరోజు విమర్శలు చేస్తే ఎలా ?అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. అందుకని కేబినెట్ ప్రక్షాళన తరువాత తలెత్తే రాజకీయ పరిణామాలను సైతం అంచనా వేసి, వాటిని కౌంటర్ చేసేందుకు కూడా వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది.

**ప్రక్షాళన చేయకుంటే పట్టుతప్పేలా ఉంది..!!**

మొన్నటి వరకు కేబినెట్ విస్తరణ అవసరం లేదని అటు కాంగ్రెస్ హైకమాండ్, ఇటు రాష్ట్రనేతలు భావించారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను నింపడం పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే మంత్రి పదవులు ఆశిస్తోన్న ఎమ్మెల్యేల జాబితా చాలా పెద్దగా ఉండటంతో ఎవరిని సంతృప్తి పరచాలో అర్థం కాక మౌనంగా ఉన్నారు. కానీ కొండా సురేఖ కుమార్తె సృష్టించిన వివాదానికి తెర పడాలంటే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తప్పదని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కేబినెట్‌లోకి కొత్తగా మున్నూరు కాపు, ఓసీ సామాజిక వర్గంతో పాటు ఎస్టీ సామాజిక వర్గం వారికి అవకాశం దక్కనుంది. పనిలో పనిగా వర్షకాల సమావేశాల్లో పెండింగ్ లో ఉన్న డిప్యూటీ స్పీకర్ ఎన్నికను సైతం పూర్తి చేయాలని భావిస్తున్నారు. సామాజిక,జిల్లాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగనుంది.

# 'అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు'.. రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు. అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 25:**

కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి పార్టీకి, ప్రజా సంఘాలకు, యూనియన్ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జన్నారం మండల కార్యదర్శి కామ్రేడ్ కొండగుర్ల లింగన్న అన్నారు. మంగళవారం జన్నారం సీపీఎం పార్టీ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సారంపల్లి మల్లారెడ్డి మృతికి సంతాపం ప్రకటించారు.ఈ సందర్భంగా కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ.. సారంపల్లి మల్లారెడ్డి (90) సీనియర్ కమ్యూనిస్టు నాయకుడిగా, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకుడిగా, రైతు సంఘం అఖిల భారత నాయకుడిగా ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆగస్టు 24న తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని తెలిపారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కనికరపు అశోక్ మాట్లాడుతూ.. సారంపల్లి మల్లారెడ్డి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన ఉద్యమ



యోధుడని అన్నారు. ఆయన ఆశయాలను, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జన్నారం మండల కమిటీ తరఫున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్లు కూకట్ కారు బుచ్చయ్య, అంబటి లక్ష్మణ్, గుడ్ల రాజన్న, డి.రాజన్న, కే.రాజయ్య, వి.చంద్రన్న, ప్రమీల, పి.కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్‌లో ఘనంగా వన మహోత్సవం.. పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 25:**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నల్ల తీగల విష్ణు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం కేవలం కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. చెట్ల వల్ల స్వచ్ఛమైన గాలి, వర్షపాతం సమతుల్యత, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటికి నీటిని అందించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం వంటి అంశాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు, మహిళలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ విశ్వక్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తల పెత్తనం తగదు

- **అధికారిక కార్యక్రమాల్లో మహిళా వార్డు సభ్యుల భర్తల జోక్యాన్ని అరికట్టాలి: 11వ వార్డు సభ్యుడు ముడుగు ప్రవీణ్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 25:**

మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తే, ఆ పదవుల ద్వారా లభించిన ప్రజా ప్రాతినిధ్యాన్ని వారి భర్తలు నిర్వహించడం సరికాదని పోనకల్ మేజర్ గ్రామపంచాయతీ 11వ వార్డు సభ్యుడు ముడుగు ప్రవీణ్ అన్నారు. మహిళా వార్డు సభ్యుల స్థానంలో వారి భర్తలు అధికారిక కార్యక్రమాలు, గ్రామపంచాయతీ వ్యవహారాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్నది మహిళా వార్డు సభ్యులనే తప్ప వారి భర్తలను కాదని స్పష్టం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులే తమ వార్డుల ప్రజల సమస్యలను తెలుసుకుని, గ్రామపంచాయతీ సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల తరఫున తమ అభిప్రాయాలను వెల్లడించాల్సిన బాధ్యత ఉందన్నారు.మహిళలకు రాజకీయ సాధికారత కల్పించాలనే లక్ష్యంతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ, కొందరు చోట్ల మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు అధికారికంగా వ్యవహరిస్తున్న తీరు రిజర్వేషన్ల అసలు లక్ష్యాన్నే నీరుగార్చే విధంగా ఉందని ప్రవీణ్ పేర్కొన్నారు. మహిళా సభ్యులు కేవలం పదవిలో ఉండి, వారి స్థానంలో భర్తలు అన్ని వ్యవహారాలు నిర్వహించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.

**ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సింది ఎన్నికైన వారే**

వార్డు పరిధిలోని తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, మౌలిక వసతులు తదితర సమస్యలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎన్నికైన వార్డు సభ్యులదేనని అన్నారు. అధికారిక కార్యక్రమాల్లో కూడా ఆయా పదవులకు ఎన్నికైన వారికే ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

**అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలి**

గ్రామపంచాయతీ అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే పాల్గొనేలా అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు పాటించాలని ముడుగు ప్రవీణ్ కోరారు. మహిళా వార్డు సభ్యుల స్థానంలో వారి భర్తలు అధికారికంగా జోక్యం చేసుకునే పరిస్థితిని అరికట్టాలని, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.మహిళలకు కల్పించిన రాజకీయ ప్రాతినిధ్యం



కేవలం పేరుకే పరిమితం కాకుండా, వారు స్వయంగా నిర్ణయాలు తీసుకుని ప్రజలకు సేవ చేసే విధంగా అవకాశాలు కల్పించాలని ఆయన అన్నారు. పోనకల్ మేజర్ గ్రామపంచాయతీలో ఎన్నికైన ప్రతి వార్డు సభ్యుడికి సమాన గౌరవం, ప్రాధాన్యం కల్పిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగించాలని ముడుగు ప్రవీణ్ కోరారు.

# అర్హులంతా పెన్షన్లకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి

- **ఈ నెల 31తో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగింపు: కామన్ పల్లి సర్పంచ్ పేరం శ్రీనివాస్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 25:**




గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పెన్షన్ పొందేందుకు అర్హత ఉండి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కామన్ పల్లి సర్పంచ్ పేరం శ్రీనివాస్ సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర సంక్షేమ పెన్షన్లకు అర్హత ఉన్న లబ్ధిదారులు గడువు ముగిసేలోపు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా ఎవరూ పెన్షన్ ప్రయోజనాన్ని కోల్పోవద్దని సూచించారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ఇబ్బందులు ఉంటే గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పెన్షన్ సౌకర్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సర్పంచ్ పేరం శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# ఆ ఇద్దరితో పార్టీకి.. ప్రభుత్వానికి చెడ్డపేరు: గాంధీభవన్‌లో మల్లు రవి హాట్ కామెంట్స్..

**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 25**



వ్యక్తుల కంటే పార్టీ క్రమశిక్షణే ముఖ్యమని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి అన్నారు. ఇవాళ గాంధీభవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన మంత్రి కొండా సురేఖ ను మంత్రి పదవి నుంచి, చిన్నారెడ్డి ని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించాలని అధిష్టానానికి నివేదిక పంపినట్లుగా తెలిపారు. ఆ ఇద్దరి వల్ల పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, క్రమశిక్షణా చర్యలు అత్యంత కఠినంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నివేదిక ఇచ్చామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గౌరవం దెబ్బతీసే పనులు ఎవరూ చేయవద్దని, రాబోయే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడొద్దని నేతలకు సూచించారు. ముఖ్యంగా పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్గా పనిచేసిన చిన్నారెడ్డి మరింత బాధ్యతాయుతంగా ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై చర్యలు తీసుకోకపోతే పార్టీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టీపీసీసీ చీఫ్ ఈ అంశాలన్నింటినీ మీనాక్షి నటరాజన్కు వివరిస్తారని, ఆమె వాటిని ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తారని మల్లు రవి స్పష్టం చేశారు.

**ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదు.**

కొండా సురేఖ, చిన్నారెడ్డి విషయంలో తమ కమిటీ చేయాల్సిన పనిని పూర్తి చేసిందని, ఇకపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలని మల్లు రవి అన్నారు. గతంలో కొండా సురేఖను హెచ్చరించినప్పటికీ ఆమె తీరు మారకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలనూ సమానంగా చూస్తుందని, ఇక్కడ ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదని స్పష్టం చేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణల ఆధారంగానే నివేదికను తయారు చేశామని పేర్కొన్నారు. హద్దులు దాటిన నేతలందరికీ ఒక స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాలని అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు.

# హసన్‌పర్తిలో విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

**వార్డెన్‌పై పోక్సో కేసు.. తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు**

**మన దునియా**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డెన్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.వార్డెన్ ప్రవర్తనతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసినట్లు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని వివరాలు తెలుసుకున్న అనంతరం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది. భద్రతపై అధికారులు దృష్టి పెట్టాలి రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## హుజురాబాద్ ఇంచార్జ్ ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

- బీఆర్ఎస్, బీజేపీకి షాక్.. గండ్రపల్లి, గూడూరు నుంచి భారీగా చేరికలు



**మన దునియా--హుజురాబాద్ నియోజకవర్గం,**



కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై జమ్మికుంట మండలం గండ్రపల్లి, కమలాపూర్ మండలం గూడూరు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.గండ్రపల్లి గ్రామ ఉపసర్పంచ్ బీరెందర్‌తో పాటు సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కమలాపూర్ మండల గూడూరు గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల అధ్యక్షుడు పరశురాం ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. వారికి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ప్రణవ్ తెలిపారు. ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురాం, కార్తీక్, సీనియర్ నాయకులు సాయిని రవి, పొనగంటి మల్లయ్య, గూడూరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచనాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమ ధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



# దేశ సౌభాగ్యానికి పునాది









- **రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.**
- **పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు కార్యాలయంలో రైతులను సన్మానించారు.**
- **అంతకుముందు ఆయన భూమారెడ్డి కన్వెన్షన్ లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

9 బ్లా కేంద్రంలోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాల జయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో 'సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించా రు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమొంటోలు అందించి అభినందించారు. అనంతరం గవర్నర్ పసుపు రైతులను ఉద్దే శించి మాట్లాడారు. నిజామాబాద్కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టంతో ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు.

**పసుపు బోర్డు ఇక్కడి రైతుల చిరకాల ఆకాంక్ష..**

ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందని గవర్నర్ పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రత్యేక చొరవ, ప్రధాని మోదీ ఆశీస్సులతో ఇది సాకారమైంద న్నారు. సాగును లాభదాయకంగా మార్చేందుకు ప్రధాని మోదీఅనేక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. భారతను ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదా రుగా కొనసాగించడంతో పాటు.. పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమన్నారు.

**సహజ వ్యవసాయం.. ఎగుమతుల ప్రోత్సాహానికి..**

సహజ వ్యవసాయం, ఎగుమతుల ప్రోత్సాహానికి దోహదపడే దూరదృష్టితో 'సునహరీ మిట్టీ అభియాన్' కార్యక్రమాన్ని ప్రా రంభించామని గవర్నర్ పేర్కొన్నారు. రసాయన ఎరువులు, ఇతర ఇన్పుట్లపై ఆధారపడడాన్ని తగ్గించడం ద్వారా నేల సారాన్ని కాపాడడంతో పాటు.. పర్యావరణ పరిరక్షణ, సాగు వ్యయాన్ని తగ్గించేందుకు సహజ వ్యవసాయం తోడ్పడుతుం దన్నారు. నాణ్యమైన పసుపునకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని.. నాణ్యతకు ప్రాధాన్యమిస్తే రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు విదేశీ మార్కెట్లకు చేరుకునే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

**పసుపు బోర్డు అన్నిరకాల ప్రయోజనం..: ఎంపీ అర్వింద్**

ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగుదశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో కేంద్రం నెరవేర్చిందన్నారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజ సం చేకూరుతుందన్నారు. పసుపు క్వింటాలు ఇచ్చే రేటు గతం కంటే పెరిగిందన్నారు. రైతులు సైతం నాణ్యమైన పసుపును గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జిల్లా కేంద్రంలో పర్యటన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన పసుపు బోర్డు కార్యాలయంలో రైతులకు సన్మానం పండిస్తే మద్దతు ధర తప్పకుండా లభిస్తుందన్నారు..

**జిల్లాపై ఎల్నినో ప్రభావం ఉందా..?**

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు క్రాప్ డైవర్సిటీనీ ప్రోత్సహిస్తున్నారా అని గవర్నర్ ప్రశ్నించారు. ఆర్అండ్బి గెస్ట్ హౌస్ లో తనను కలిసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేం దుకు, జిల్లా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు.

**నషా ముక్త్ భారత్ కోసం యువత శ్రమించాలి..**

అంతకుముందు నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్లో 'నషా ముక్త్ భారత్'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. మాదకద్రవ్యాల ప్రభావానికి యువత దూరంగా ఉండి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నవకల్పన, దేశసేవ వైపు అడు గులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'సషా ముక్త్ భారత్ అభియాన్' విస్తృత ప్రజా ఉద్యమంగా రూ పుదిద్దుకుంటోందని తెలిపారు. మాదకద్రవ్యాలపై యువతలో అవగాహన, చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం కూడా ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. నషాతో సర్వం వినాశనమేనన్నారు. యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కమి షనరేట్ పరిధిలో పోలీసులు నషా ముక్త్ భారత్ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, నగర మేయర్ ఉమారాణి, అర్బన్ ఎమ్మె ల్యేధనాపాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి. జాతీయ పసుపు బోర్డు అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల ఎప్పుడు?

**జమ్మికుంటలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ**

**స్కాలర్‌షిప్‌లు దానం కాదు.. విద్యార్థుల హక్కు**

**మన దునియా హుజురాబాద్ నియోజకవర్గం, జమ్మికుంట,**




పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జమ్మికుంటలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అధ్యక్షతన బస్టాండ్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా మాట్లాడుతూ.. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దానం కాదని, వారి విద్యా హక్కని అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని, కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో పలువురు విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, నాయకులు తాళ్లపల్లి విష్ణు, యశ్వంత్, వంశీ, శ్రీవిద్య, సంజన, అనన్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వసూళ్ల పర్వం...

**మీ సేవల్లో నిలువు దోపిడీ**

**“ డబ్బులిస్తే చాలు.. తప్పుడు సర్టిఫికెట్లు**

**“ నిబంధనలకు విరుద్ధంగా అధిక రుసుములు**

**“ చూసీ చూడనట్లుగా అధికారులు**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:** ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి చేర్చిన మీసేవా కేంద్రాలు అవినీతికి, అక్రమాలకు అడ్డాలుగా మారిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత లేని వారికి కూడా అర్హతలున్నట్లు అనుకూ లమైన సర్టిఫికెట్లు జారీచేస్తున్నాయి. కొందరు చాలా కాలంగా మీసేవా కేంద్రాలు నడుపుతున్న మీసేవా కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు భారీ ప్రయోజనాలు చేకూర్చేందుకు ఉపయోగపడే పలు సర్టిఫికెట్లను జారీ చేయించి ఇప్పించేందుకు అక్రమ పద్ధతిలో తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ డాక్యుమెంట్లు సబ్మిట్ చేసి సక్రమ మార్గంలో సర్టిఫికెట్లు జారీ చేయిస్తున్నారు. ఇందుకోసం మీసేవా కేంద్రాల నిర్వాహకులు భారీగా నగదు బదిలీ జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

**ఫిర్యాదులున్నా.. చర్యలు సున్నా..**

మీసేవా కేంద్రాల్లో జరిగే అక్రమాలపైన, అధిక మొత్తంలో డబ్బులు తీసుకునే విషయంలోనూ మీ సేవా కేంద్రాలపై ఫిర్యాదులున్నాయి. భారీగా డబ్బులు తీసుకుని తప్పుడు ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారంటూ జిల్లాలోని డిచ్పల్లి, మా కూర్, బాల్కొండ నవిపేట్, నిజామాబాద్ నగరంలోని నాందేవ్ వాడ, కంఠేశ్వర్, నందిపేట్, భీమ్గల్, బోధన్, బాల్కొండ తదితర మండల కేంద్రాల్లోని పలు మీసేవా కేంద్రా ల నిర్వాహకులపై గతంలో పలుమార్లు జిల్లా ఉన్న తాధికారులకు ఫిర్యాదులు అందాయి.. మీసేవా కేంద్రాల్లో జరిగే అక్రమాలపై బాధిత జనాలు ఫిర్యా దులు కూడా చేశారు. కానీ, అధికారులు వాటిపై మొక్కుబడి విచారణలు చేసి ఆల్ ఈజ్ వెల్ అన్నట్లుగా క్లీన్ చీట్ ఇవ్వడంతో ఆయా మీసేవా కేంద్రాల నిర్వాహకులు అడ్డూ అదుపూ లేకుండా అక్రమాలు చేస్తున్నారు.

**అధికంగా రుసుం వసూళ్లు....**




మీసేవా కేంద్రాల్లో ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా ఒక్కో సేవకు సబంధించి సేవా రుసుం ను నిర్దేశిం చారు. దాని ప్రకారం మీసేవా కేంద్రాల్లో సేవా రుసుం ను తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఇష్టారీతిన జనాల వద్ద అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు సమాచారం. మీసేవా కేంద్రాల్లో జరిగే అవినీతి, అక్రమాలు, దోపిడీని అరికట్టాల్సిన బాధ్యత సంబంధిత మండల రెవెన్యూ అధికారులైదనప్ప టికీ వారికేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమ ర్శలున్నాయి. నెలవారీ మామూళ్ల రూపంలో రెవెన్యూ అధికారులకు మీసేవా కేంద్రాల నిర్వాహ కుల సంఘం నుండి డబ్బులు చేరుతున్నాయని, దీంతో ఇక మీసేవా కేంద్రాల్లో ఏం జరిగినా అంతా ఓకే అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలున్నాయి. మీసేవా కేంద్రాల్లో జరిగే అక్రమాలు రుజువైతే సేవా కేంద్రాలను రద్దు చేసే అవకాశాలున్నప్పటికీ అధికారులు కేంద్రాల నిర్వాహకులతో మిలాఖతై భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని అక్రమార్కులకే మళ్లీ అవకా శాలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విష యంలో జిల్లా ఉన్నతాధికారులే నేరుగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటే తప్ప మీసేవా కేంద్రాల్లో జరిగే అక్రమాలకు, దోపిడీకి అడ్డుకట్ట పడే అవకాశాల్లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి.

# గ్రంథాలయ సిబ్బంది కన్నీటి వ్యథ

**సిబ్బందిపై అదనపు మండలాల భారం**

**ఇన్చార్జిల పేరుతో తీవ్ర మానసిక ఒత్తిడి**

**రెగ్యులరైజ్ కోసం 30 ఏళ్లుగా ఎదురుచూపులు**

**గ్రంథాలయ సిబ్బంది కన్నీటి వ్యథ**

**ఇన్చార్జిల పేరుతో తీవ్ర మానసిక ఒత్తిడి**

**“ రెగ్యులరైజ్ కోసం 30 ఏళ్లుగా ఎదురుచూపులు**

**“ ఉమ్మడి జిల్లా నుంచి సేవలు అందిస్తున్నా వీడని ఉద్యోగ భద్రత లేమి**

**- సకాలంలో జీతాలు లేక ఇబ్బందులు**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

కామారెడ్డి జిల్లాలో గ్రంథాలయ శాఖను నమ్ముకుని దశాబ్దాలు గా సేవలు అందిస్తున్న పార్ట్ టైం, అవుట్సోర్సింగ్ ఉద్యోగు ల బతుకులు నేటికీ అగమ్యగోచరంగానే ఉన్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తమ సర్వీసులు రెగ్యు లరైజ్ అవుతాయన్న వారి ఆశలు కలగానే మిగిలిపోతున్నా యి. కనీస ఉద్యోగ భద్రత లేక, సకాలంలో జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న వీరికి, అధికారుల తీరుతో అదనపు భారం తోడవుతోంది.

ఉమ్మడి, నిజామాబాద్ జిల్లా: జిల్లా వ్యాప్తంగా మండలాల కొన్ని సైతం సిబ్బంది కొరత.

వారీగా మొత్తం 19 గ్రంథాలయ శాఖలు ఉండగా, వీటిలో కేవలం ఆరుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, మిగిలిన చోట్ల ఆరుగురు అవుట్ సోర్సింగ్, మరో ఎనిమిది మంది పార్ట్ టైం సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఉన్న అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తుండగా.. మరోవైపు పలు మండలాల్లో వీరికి ఇన్ చార్జిలుగా అంటగడుతున్నారు. ఒకే వ్యక్తికి రెండు, మూడు గ్రంథాలయాల నిర్వహణ భారం మోపుతుండటంతో ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఒక మండ లం నుంచి మరో మండలానికి ప్రయా ణించి విధులు నిర్వహించాల్సి రావడంతో వారికి ప్ర యాణ భత్యం కూడా లేకుండా జేబులోంచి ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. వయసు మీరినా మారని దుస్థితి, జీతాల్లో జాప్యం ఈ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల్లో ఎక్కువమంది ఇప్పటికే 50 ఏళ్లకు పైబడిన వారే ఉన్నారు. జీవితంలో



ముసలితనం ముంచుకొస్తున్నా, ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమ ఉద్యోగాలు మాత్రం క్రమబద్ధీకరణ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇన్నాళ్లుగా సేవలు అందిస్తున్నా వీడని ఉద్యోగ భద్రత లేమితో సతమతమవుతున్నారు. రిటైర్మెంట్ వయసు దగ్గరపడుతున్నా తమకు ఎలాంటి సర్వీసు బెనిఫిట్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు దక్కవని వాపోతున్నారు. నెలల తరబడి జీతాలు పెండింగ్ లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పండుగ సమయాల్లో కూడా జీతాలు రాక అప్పులు చేయాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఖాళీల భర్తీలో జాప్యం

మరోవైపు, జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది నిరు ద్యోగులు సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. గ్రంథాలయాల్లో నంబి డి పెద్ద ఎత్తున ఉపాధి దొరికినట్లు అవుతుంది. కానీ, ప్రభుత్వాలు మాత్రం కొత్త నియామకాలు చేపట్ట కుండా, ఉన్న కొద్దిమంది అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం సిబ్బందిపైనే ఇన్ చార్జీల భారాన్ని మోపుతూ కాలం వెళ్లదీస్తోందనే విమర్శలు వ్యక్త మవుతున్నాయి. దీంతో లైబ్రరీ సైన్స్ చదివిన అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ నిరాశలో కూరుకుపోతున్నారు.

మూతపడుతున్న గ్రామీణ గ్రంథాలయాలు

సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుండటంతో కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు నిర్వహణ లేక పూర్తిగా మూతపడుతున్నాయి. పల్లెల్లో విజ్ఞానా నిండటంతో విద్యార్థులు, పోటీ పరీక్షలేసి న్ని పంచాల్సిన గ్రంథాలయాలకు సిద్ధమయ్యే యువకులు తీవ్రంగా నష్టపోతు న్నారు. పత్రిక బిల్లులు, కరెంట్, కిరాయి రూములు.గ్రంథాలయాలు. బిల్లుల బకాయి లతో నిర్వహణ మరింత అస్తవ్యస్తంగా మారింది. పుస్తకాలు చెదలు పట్టి, కంప్యూటర్లు మూలన పడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి.. జిల్లాలో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న పార్ట్ టైం, అవుట్ సో ర్సింగ్ గ్రంథాలయ ఉద్యోగుల సేవలను రెగ్యుల రైజ్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు బాసటగా నిలవాలని పాఠకు లు, స్థానికులు కోరుతున్నారు.

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎన్ల పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఆగస్టు । బుధవారం । 26 । 2026


# శ్రీలంక స్టార్ బౌలర్ ను మందలించిన ఐసీసీ.. ఒక డీమెరిట్ పాయింట్

**ఔటైన కోపంలో అసహనం.. లంక స్పిన్నర్ జయసూర్యపై ఐసీసీ చర్యలు**

**క్రికెట్ పరికరాలను దుర్వినియోగం చేసినందుకు అధికారిక మందలింపు, డీమెరిట్ పాయింట్**

**భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్, లంక పేసర్ అసిత్ ఫెర్నాండో మధ్య ఘర్షణ**

**ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత, చెరో డీమెరిట్ పాయింట్ కేటాయింపు**

**ముగ్గురు ఆటగాళ్లు తమ తప్పును అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్షలు ఖరారు**



భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య తన ప్రవర్తనతో వివాదంలో చిక్కుకున్నాడు. ఔటైన తర్వాత ఆగ్రహంతో ప్రవర్తించినందుకు అతడిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్యలు తీసుకుంది. అతడిని అధికారికంగా మందలించడంతో పాటు, ఒక డీమెరిట్ పాయింట్‌ను ఖాతాలో చేర్చింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను జయసూర్య ఉల్లంఘించినట్లు ఐసీసీ నిర్ధారించింది. అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ పరికరాలను, మైదానంలోని వస్తువులను దుర్వినియోగం చేయడం ఈ నిబంధన కిందకు వస్తుంది.సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నైట్‌వాచ్‌మన్‌గా బ్యాటింగ్‌కు వచ్చిన జయసూర్య, భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అంపైర్ నిర్ణయంపై తీవ్ర నిరాశకు గురైన అతను, పెవిలియన్‌కు వెళుతూ బౌండరీ లైన్ వద్ద ఉన్న వెడ్జెస్‌ను బ్యాట్‌తో కొట్టాడు. డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాక గ్లోవ్స్‌ను కూడా కోపంగా విసిరేశాడు. భారత్ 503/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసిన తర్వాత, రెండో రోజు చివరి మూడు ఓవర్లలోనే శ్రీలంక రెండు వికెట్లు కోల్పోయి 8/2తో కష్టాల్లో పడింది. ఈ ఒత్తిడి కూడా అతని ప్రవర్తనకు కారణంగా భావిస్తున్నారు. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ప్రతిపాదించిన శిక్షను జయసూర్య అంగీకరించడంతో, అధికారిక విచారణ అవసరం రాలేదు.కాగా, ఈ మ్యాచ్‌లో ఐసీసీ చర్యలకు గురైన ఏకైక ఆటగాడు జయసూర్య మాత్రమే కాదు. భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత్ ఫెర్నాండో మధ్య జరిగిన ఘర్షణపై కూడా ఐసీసీ కఠినంగా వ్యవహరించింది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు, చెరో డీమెరిట్ పాయింట్‌ను కేటాయించింది. మ్యాచ్ 17వ ఓవర్‌లో ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. పెవిలియన్‌కు వెళుతున్న జైస్వాల్‌ను ఉద్దేశించి ఫెర్నాండో ఏదో అనడంతో, అతను వెనక్కి తిరిగి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకరినొకరు నెట్టుకుంటూ తలలతో ఢీకొట్టుకున్నారు.ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.12 ప్రకారం "సహచర ఆటగాళ్లు లేదా ఇతర వ్యక్తులతో అనుచితంగా భౌతికంగా ప్రవర్తించడం" కింద వీరిపై చర్యలు తీసుకున్నారు. జయసూర్య మాదిరిగానే వీరిద్దరూ కూడా తమ తప్పును అంగీకరించడంతో విచారణ జరగలేదు. గత 24 నెలల్లో వీరిద్దరి ఖాతాలో ఎలాంటి డీమెరిట్ పాయింట్లు లేవని ఐసీసీ పేర్కొంది.

# ఏపీఎల్ మహిళా క్రికెటర్ల వేలం: అత్యంత పిన్న వయస్కురాలిగా 12 ఏళ్ల షణ్ముఖప్రియ ఘనత

**W-APL వేలంలో ప్రత్యేక ఆకర్షణగా 12 ఏళ్ల షణ్ముఖ ప్రియ**

**హోరాహోరీగా సాగిన వేలంలో 74 మంది క్రీడాకారిణుల కొనుగోలు**

**గోదావరి జట్టుకు రికార్డు స్థాయిలో రూ.4.30 లక్షలకు అమ్ముడైన హెర్నిటా**

**సెప్టెంబర్ 15 నుంచి మంగళగిరి స్టేడియంలో ౨20 టోర్నీ**




ఆంధ్రా క్రికెట్‌లో ఓ కొత్త శకం మొదలైందనడానికి నిదర్శనంగా నిలిచింది 12 ఏళ్ల షణ్ముఖ ప్రియ. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఔ-ూూూ) కోసం జరిగిన వేలంలో ఈ చిన్నారిని రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు కొనుగోలు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతి పిన్న వయస్కురాలిగా నిలిచిన షణ్ముఖ ప్రియ, ఈ లీగ్ యువ ప్రతిభను ప్రోత్సహించడానికి ఎంతగా కట్టుబడి ఉందో చెప్పకనే చెబుతోంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారిణులను వెలుగులోకి తీసుకురావాలన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ూజూూ) లక్ష్యానికి ఈ ఎంపిక అద్దం పడుతోంది.విజయవాడలో జరిగిన ఈ ప్లేయర్ల వేలం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. మొత్తం నాలుగు ఫ్రాంచైజీలు 74 మంది మహిళా క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు తీవ్రంగా పోటీపడ్డాయి. రాయలసీమ జెన్ స్టార్స్, అమరావతి ఈ-ఛాంపియన్స్‌తో పాటు వైజాగ్ ఫైర్ బర్డ్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్ జట్లు తమకు కేటాయించిన రూ.15 లక్షల పర్స్‌తో బలమైన జట్లను నిర్మించుకున్నాయి.

వేలంలో ఇతర ముఖ్యాంశాలు

ఈ వేలంలో ఆల్‌రౌండర్ ఫెరీరా హెన్రిటా అత్యధిక ధర పలికింది. ఆమెను గోదావరి గోల్డెన్ ఈగిల్స్ ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో రూ.4.30 లక్షలకు సొంతం చేసుకుంది. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఈ టోర్నమెంట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం లీగ్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ టీ20 టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో జరగనుంది. మొత్తంగా ఈ లీగ్, ఆంధ్రాలో మహిళా క్రికెట్ అభివృద్ధికి ఒక చారిత్రాత్మక ముందడుగుగా క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## సెహ్వాగ్ కొడుకు బ్యాట్‌లోనూ అదే జోరు.. డీపీఎల్‌లో ఆర్యవీర్ అదుర్స్

మైదానంలో వీరేంద్ర సెహ్వాగ్ బ్యాట్ నుంచి వచ్చే షాట్లకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఇప్పుడు అదే తరహా షాట్లు అతడి కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ బ్యాట్ నుంచి కనిపించడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. 'ఢిల్లీ ప్రీమియర్ లీగ్' (డీపీఎల్)లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్యవీర్.. తండ్రి తరహా బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు.ఆర్యవీర్ ఆడిన కొన్ని షాట్లను డీపీఎల్ నిర్వాహకులు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యంగా స్క్వేర్ డ్రైవ్, కవర్ డ్రైవ్‌లో వీరేంద్ర సెహ్వాగ్ శైలిని తలపించాడు. తండ్రి, కొడుకు షాట్లను పోల్చుతూ రూపొందించిన వీడియో ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.

**తండ్రి దారిలోనే..**

భారత క్రికెట్‌లో సెహ్వాగ్ దూకుడైన బ్యాటింగ్‌కు పెట్టింది పేరు. మూడు ఫార్మాట్లలో కలిపి 17,253 పరుగులు చేసిన ఆయన.. 38 అంతర్జాతీయ శతకాలు సాధించారు. ఇప్పుడు ఆయన కుమారుడు కూడా అదే తరహా షాట్లతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి పెంచుతున్నాడు.

**వెస్ట్ ఢిల్లీకి ఓటమి**



డీ వీ ఎ ల్ లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ 21 పరుగుల తేడాతో ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన సెంట్రల్ ఢిల్లీ 20 ఓవర్లలో 232/8 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో వెస్ట్ ఢిల్లీ 211/8కే పరిమితమైంది. ఈ మ్యాచ్‌లో ఆర్యవీర్ త్వరగానే ఔటయ్యాడు. క్రిష్ యాదవ్ 46, అంకిత్ కుమార్ 61 పరుగులతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు.

## ముగిసిన మూడో రోజు ఆట.. లంక పోరాడినా భారత్‌దే ఆధిపత్యం



భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక గట్టిగా పోరాడుతున్నప్పటికీ, టీమిండియా పట్టు బిగించింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. వర్షం, వెలుతురులేమి కారణంగా ఆటను ముందుగానే నిలిపివేశారు. ప్రస్తుతం భారత్ ఇంకా 238 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండి మ్యాచ్‌పై పూర్తి నియంత్రణతో ఉంది.మూడో రోజు ఆటలో శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూశ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 135 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. భారత స్పిన్నర్లపై స్వీప్ షాట్లను సమర్థంగా ఆడుతూ ఒంటరి పోరాటం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒక అరుదైన ఘనత సాధించాడు. భారత్‌పై తన తొలి మూడు టెస్ట్ ఇన్నింగ్స్‌లలో వరుసగా మూడు 50ం స్కోర్లు సాధించిన రెండో శ్రీలంక బ్యాటర్‌గా (దులీప్ మెండిస్ తర్వాత) రికార్డు సృష్టించాడు.అతనికి కేశర నువంత (18) నుంచి కొంత సహకారం లభించింది. అయితే, వీరి భాగస్వామ్యాన్ని భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ విడదీశాడు. సుతార్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన నువంత, మిడ్-ఆఫ్‌లో సారాంశ్ జైన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించి చెరో మూడు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశాడు. మూడో రోజు చివరి సెషన్‌లో రెండో కొత్త బంతి అందుబాటులోకి రావడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని భారత్ భావించింది. కానీ, వెలుతురు తగ్గడంతో స్పిన్నర్లతోనే బౌలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం ప్రారంభమవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ తర్వాత వాతావరణం అనుకూలించకపోవడంతో 5:15 గంటలకు మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. ఆట ముగిసే సమయానికి దినూశ 84 పరుగులతో, లహిరు కుమార 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు (503/9 డిక్లేర్డ్)కు ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. కేవలం రెండు వికెట్లు మాత్రమే చేతిలో ఉన్నందున, నాలుగో రోజు శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించి, మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించాలని టీమిండియా భావిస్తోంది.

## బౌలర్‌గానూ వైభవ్ సూర్యవంశీ అదుర్స్.. ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు

**దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో వైభవ్ 8 పరుగులకే ఔట్**

**కేవలం ఆరు బంతులే ఎదుర్కొన్న యువ బ్యాటర్**

**రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసిన వైభవ్**

**ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసిన వైనం**

వైభవ్ సూర్యవంశీ అంటే బ్యాట్‌తో విధ్వంసమే గుర్తుకొస్తుంది. కానీ, ఈసారి బంతితోనూ అదరగొట్టాడు. నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో బంతితో మాత్రం తనలోని కొత్త టాలెంట్‌ను బయటపెట్టాడు.నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘరామి 146, షాబాజ్ అహ్మద్ 167 పరుగులతో రాణించారు. అనంతరం నార్త్ ఈస్ట్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కట్టడి చేసిన ఈస్ట్ జోన్ ఫాలోఆన్ విధించింది.రెండో ఇన్నింగ్స్‌లోనూ నార్త్ ఈస్ట్ జోన్ బ్యాటర్లు తడబడ్డారు. 90 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. వైభవ్ సూర్యవంశీ తన ఎడమచేతి స్పిన్‌తో ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు.జట్టు తరఫున అత్యధికంగా 25 పరుగులు చేసిన కిషన్ లింగ్డో, 4 పరుగులు చేసిన ఇమ్లివాటి లెమ్తూర్‌ను వైభవ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ రెండు వికెట్లు కూడా అతడికి క్యాచ్‌ల రూపంలో దక్కడం విశేషం. దీంతో వైభవ్‌కు ఒకే ఓవర్లో 'డబుల్ డిలైట్' దక్కిందని బీసీసీఐ సోషల్ మీడియాలో ప్రశంసించింది. మరోవైపు వైభవ్ జెర్సీ నంబర్‌పైనా ఆసక్తికర చర్చ సాగింది. అతడి జెర్సీ నంబర్‌లో కొంత భాగాన్ని టేప్‌తో కప్పి ఉంచారు. దీంతో కేవలం '3' మాత్రమే కనిపించింది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా వైభవ్ '3' నంబర్ జెర్సీ ధరిస్తాడు. జెర్సీపై ముద్రణలో లోపం వల్లే మిగిలిన సంఖ్యను టేప్‌తో కప్పి ఉండొచ్చని భావిస్తున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# యశ్ 'టాక్సిక్' హంగామా.. తెలుగు రాష్ట్రాల్లో మొదలైన టికెట్ల సందడి



'కేజీఎఫ్' చిత్రాలతో పాన్-ఇండియా స్టార్‌గా అశేష ప్రేక్షకాదరణ పొందిన రాకింగ్ స్టార్ యశ్, తన కొత్త చిత్రం 'టాక్సిక్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా రేపు (ఆగస్టు 26) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన మల్టీప్లెక్స్‌లు, థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. "ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించడం విశేషం. అంతేకాకుండా, ఈ సినిమాకు యశ్ సహ-రచయితగా, నిర్మాతగా కూడా వ్యవహరించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్‌లపై వెంకట్ కె నారాయణతో కలిసి యశ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ వంటి భారీ తారాగణం నటిస్తుండటంతో సినిమా స్థాయి మరింత పెరిగింది. 'కేజీఎఫ్' సిరీస్‌కు అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన రవి బస్రూర్ ఈ సినిమాకు కూడా సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. యశ్, రవి బస్రూర్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడంతో సినిమా ఆడియోపై కూడా అంచనాలు పెరిగాయి. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ రిలీజ్) ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ప్రస్తుతం టికెట్ల బుకింగ్స్ వేగంగా జరుగుతుండగా, 'టాక్సిక్' ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు యశ్ అభిమానులు, సినీ ప్రియులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# తెలుగులోకి మమితా బైజు మలయాళ హిట్ మూవీ!

'ప్రేమలు' సినిమా నుంచి మమితా బైజు తన జోరును కొనసాగిస్తూ వెళుతోంది. ఒక్కొక్కటిగా ఆమె భారీ ప్రాజెక్టులు థియేటర్స్ కి వస్తున్నాయి. ఆమె నటనకు మంచి మార్కులు తెచ్చిపెడుతున్నాయి. అలాంటి మమితా బైజు, రీసెంటుగా మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుంది. ఆ సినిమా పేరే 'బెత్లేహం కుటుంబ యూనిట్'. మలయాళంలో రూపొందిన ఈ సినిమాకి గిరీశ్ దర్శకత్వం వహించాడు. నిర్మాతలలో ఒకరిగా ఫహాద్ ఫాజిల్ వ్యవహరించిన సినిమా ఇది. మలయాళంలో నవీన్ పౌలికి మంచి క్రేజ్ ఉంది. ఆయన ఎంచుకునే కథలు .. పాత్రలు .. సహజమైన ఆయన నటనే అందుకు కారణమని చెప్పాలి. ఓటీటీ సినిమాల కారణంగా ఇతర భాషలలోను ఆయనకి అభిమానులు ఉన్నారు. అలాంటి నివిన్ పౌలి కథానాయకుడిగా నటించిన సినిమా ఇది. ఆయన జోడీగా మమితా బైజు నటించిన ఈ సినిమా, అక్కడి యూత్ ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ ఆడియన్స్ వైపు నుంచి కూడా ఈ సినిమాకి మంచి మద్దతు లభిస్తోంది. విష్ణు విజయ్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాను, ఈ నెల 21వ తేదీన అక్కడి థియేటర్లలో విడుదల చేశారు. 60 కోట్లకి పైగా వసూళ్లతో ఈ సినిమా అక్కడ తన దూకుడు చూపిస్తోంది. రొమాంటిక్ కామెడీ జోనర్లో నిర్మితమైన ఈ సినిమాను, తెలుగులోనూ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సెప్టెంబర్ 4వ తేదీన ఈ సినిమాను తెలుగులో విడుదల చేయనున్నట్టుగా అధికారిక ప్రకటన చేశారు. మరి ఈ సినిమా ఇక్కడి థియేటర్ల వైపు నుంచి ఏ స్థాయి వసూళ్లను రాబడుతుందనేది చూడాలి.






# కంగనాతో గొడవపై తాప్సీ ఫైర్.. ఆ ప్రశ్నలు ఆపితేనే వివాదం ముగుస్తుంది!

బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, విలక్షణ నటి తాప్సీ మధ్య మాటల యుద్ధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తాజాగా ఈ వివాదంపై తాప్సీ మరోసారి స్పందించారు. అయితే ఈసారి ఆమె తన అసహనాన్ని మీడియాపై ప్రదర్శించడం గమనార్హం. తమ మధ్య గొడవ ఇంకా రగులుతూనే ఉండటానికి మీడియానే కారణమని ఆమె ఆరోపించారు.

వివరాల్లోకి వెళితే...

తాప్సీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గాంధారి'. మంగళవారం ముంబైలో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓ విలేకరి, కంగనాతో ఆమెకున్న వివాదం గురించి ప్రశ్నించారు. దీనికి స్పందించిన తాప్సీ, మీడియా తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ విషయాన్ని మీరెందుకు ముగియనివ్వరు? మా ఇద్దరినీ ఈ ప్రశ్న అడగడం ఆపినప్పుడే ఈ వివాదం ముగుస్తుంది. బహుశా ఇదంతా చూసి మీరంతా ఆనందిస్తున్నట్టున్నారు. అందుకే పదే పదే అవే ప్రశ్నలు అడుగుతున్నారు. మీరు ఇలాంటి ప్రశ్నలు అడగటం ఆపేస్తే ఈ గొడవ ఎప్పుడో ముగిసిపోయేది" అని తాప్సీ ఘాటుగా సమాధానమిచ్చారు.

ఇటీవల రాజుకున్న వివాదం

కొద్ది రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో తాప్సీ, కంగనాతో తనకున్న సంబంధం గురించి మాట్లాడుతూ.. ఆమె మాట్లాడే తీరు ఆమె పెంపకాన్ని ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. దీనిపై కంగనా తీవ్రంగా స్పందించారు. పేరు ప్రస్తావించకుండా తాప్సీని "సస్తీ కాపీ" (చౌకబారు నకలు) అని విమర్శిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "ఓ సస్తీ కాపీ తన బి-గ్రేడ్ సినిమాతో ముందుకొచ్చింది. కానీ ఎప్పటిలాగే మీడియాలో హెడ్‌లైన్ మాత్రం కంగనా రనౌత్ గురించే. నా తల్లిదండ్రులు, వారి పెంపకాన్ని అపహాస్యం చేసే స్థాయికి దిగజారింది. నా తల్లిదండ్రులలాగా ఒరిజినల్‌ను కనలేకపోయారని ఆమె తల్లిదండ్రులను నేను కూడా అడగాలనుకుంటున్నాను. ఎందుకు ఇంత చీప్ కాపీ?" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను రాజ్‌పుత్ జమీందార్ కుటుంబం నుంచి వచ్చినా, సొంతంగా ఎదగాలని నిర్ణయించుకున్నానని, దానికోసం తన తల్లిదండ్రులను నిందించడం దారుణమని అన్నారు. అయితే, ఆ తర్వాత కంగనా ఆ పోస్ట్‌ను డిలీట్ చేశారు. 2019లో కంగనా సోదరి రంగోలి చందేల్, తాప్సీని తొలిసారి "సస్తీ కాపీ" అని సోషల్ మీడియాలో సంబోధించడంతో వీరి మధ్య వివాదం మొదలైంది. అప్పటి నుంచి ఏదో ఒక రూపంలో ఈ మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. తాజాగా తాప్సీ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరోసారి బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

# 'టాక్సిక్' దర్శకురాలు ఎమోషనల్.. యశ్ నన్ను నమ్మాడు!

రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్' సినిమాతో రేపు (ఆగస్టు 26) ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్, తన తండ్రి తనకు ఇచ్చిన ఒక అమూల్యమైన సలహాను గుర్తుచేసుకున్నారు. చెన్నైలో జరిగిన ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ, తన సినీ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను, హీరో యశ్ తనపై ఉంచిన నమ్మకాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.తన ప్రసంగాన్ని మొదలుపెడుతూ, "నేను నాలుగన్నరేళ్ల వయసులో సినిమా రంగంలోకి వచ్చాను. అక్కడి నుంచి ఇక్కడి వరకు నా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటున్నాను. నేను స్కూల్లో చాలా యావరేజ్ స్టూడెంట్‌ని. అన్నింటిలోనూ ఫెయిల్ అయ్యేదాన్ని. నన్ను ఎవరూ ఏ ఆటకూ ఎంచుకునేవారు కాదు. ఒకరకంగా నేను పూర్తిగా విఫలమయ్యాననే చెప్పాలి" అని గీతూ తెలిపారు. ఆ సమయంలో తన తండ్రి చెప్పిన మాటలు తనలో నిలిచిపోయాయని అన్నారు. ""నువ్వు ఏం చేయాలనుకుంటున్నావు? అన్నీ ఫెయిల్ అవుతున్నావు కదా, ఏమవ్వాలనుకుంటున్నావు?' అని నాన్న అడిగారు. దానికి నేను 'బేకర్' అవుతానని చెప్పాను. అప్పుడు ఆయన, 'అయితే సరే, ఆ పట్టణంలో నువ్వే అత్యుత్తమ బేకర్‌గా నిలవాలి' అని చెప్పారు. ఆ మాట నా మదిలో నాటుకుపోయింది" అని ఆమె వివరించారు.ఆ సలహా వల్లే తాను ఏ పని చేసినా, ఎక్కడికి వెళ్లినా గుర్రానికి గంతలు కట్టినట్లుగా కేవలం తన లక్ష్యంపైనే దృష్టి పెట్టానని గీతూ పేర్కొన్నారు. "చుట్టూ ఉన్న శబ్దాలను పట్టించుకోలేదు. నన్ను ఎవరూ నిరుత్సాహపరచకుండా చూసుకున్నాను. నేను నా గమ్యాన్ని చేరాల్సిందే అని అనుకున్నాను" అని అన్నారు. ఇదే వేదికపై, తనను ఎవరూ నమ్మని రోజుల్లో హీరో యశ్ తనపై నమ్మకం ఉంచారని చెబుతూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."ఈ రోజు నేను ఒకటి చెప్పగలను. నా చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు నా ప్రయాణంలో, ప్రపంచంలో అందరికంటే యశ్ నన్ను నమ్మారు. నా కృతజ్ఞతను మాటల్లో చెప్పలేను. ఎందుకంటే అది ఒక ప్రతిధ్వని లాంటిది. ఒకరు నమ్మకంతో చప్పట్లు కొడితే, ఆ చప్పట్లను ప్రపంచం అనుసరిస్తుంది. ఆయన నన్ను నమ్మిన తర్వాతే, అందరూ నమ్మడం మొదలుపెట్టారు. అది ఒక గొలుసుకట్టు ప్రతిచర్యలా మారింది. ఆ మొదటి స్వరాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను" అని గీతూ మోహన్‌దాస్ ఉద్వేగంగా తన ప్రసంగాన్ని ముగించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com